నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# సిద్దిపేట

గురువారం 28 డిసెంబర్ 2023
THURSDAY, DECEMBER 28, 2023

SIDDIPET

పేజీలు : 8
PAGES




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు

# వచ్చే ఎన్నికల్లో సత్తాచాటుదాం

## పార్లమెంట్, స్థానిక సంస్థల ఎలక్షన్లలో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

- అధికారం కోల్పోవడం స్పీడ్ బ్రేక్ మాత్రమే
- కేసీఆర్ అంటే నమ్మకం.. బీఆర్ఎస్ అంటే విశ్వాసం
- ఎవరూ అధైర్యపడొద్దు.. భవిష్యత్ మనదే
- రైతుబంధు కింద 13 సార్లు రూ.72వేల కోట్లు ఇచ్చాం
- ఎన్నికల్లో హామీలివ్వకున్నా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టాం
- మెదక్ జిల్లాకు సింగూరు నీళ్లిచ్చాం
- రైతుబీమా దండగ అని మాట్లాడడం సిగ్గుచేటు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- మెదక్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం

8

త్వరలో జరగనున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా కేంద్రంలోని వైస్రాయ్ గార్డెన్స్‌లో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మెదక్, హవేళీఘణపూర్ మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు గెలుపోటములు కొత్తకాదని, ఇది కేవలం స్పీడు బ్రేకర్ మాత్రమేనన్నారు. తెలంగాణతో బీఆర్ఎస్‌ది పేగు బంధమని, కేసీఆర్ అంటే నమ్మకం, బీఆర్ఎస్ అంటే విశ్వాసమన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని, ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నానని భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌కు గోదావరి, మెదక్‌కు సింగూరు నీళ్లిచ్చామని, ఏడుపాయల అభివృద్ధికి కేసీఆర్ రూ.100 కోట్లతో జీవో ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెసోళ్లు అధికార దాహంతో ఉన్నారని, రైతుబీమా దండగ అని అసెంబ్లీలో అనడం సిగ్గుచేటన్నారు. ఆ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

- మెదక్ (నమస్తే తెలంగాణ)/ మెదక్ రూరల్, డిసెంబర్ 27



సంగారెడ్డిలో మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

# నిషేధిత అల్ప్రాజోలం పట్టివేత

- రూ.74లక్షల విలువైన ముడిసరుకు స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్టు, రెండు కార్లు సీజ్
- మీడియాతో వివరాలు వెల్లడించిన సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్

8

సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలో పెద్దఎత్తున నిషేధిత అల్ప్రాజోలం డ్రగ్స్ ముడి సరుకును స్వాధీనం చేసుకున్నామని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. ఎవరికీ అనుమానం రాకుండా ఓయో రూం అద్దెకు తీసుకొని అల్ప్రాజోలం ముడి సరుకును కొన్ని రసాయనాలతో మత్తుమందు తయారు చేసి పేద, మధ్యతరగతి వారికి విక్రయిస్తున్న నలుగురిని జిల్లా పోలీసులు, స్పెషల్ ఆపరేషన్ టీం అరెస్టు చేసిందన్నారు. నిందితుల నుంచి సుమారు రూ.74 లక్షలు విలువైన కొన్ని రసాయన పదార్థాలు, అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మధ్యకాలంలో అనేక మంది యువతీయువకులు డ్రగ్స్, గంజాయికి అలవాటుపడి అనేక నేరాలు చేస్తున్నారని, ఎవరైనా డ్రగ్స్, గంజాయి అమ్మినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రూపేశ్ హెచ్చరించారు.

- సంగారెడ్డి అర్బన్, డిసెంబర్ 27

# ఆరు గ్యారంటీలు పారదర్శకంగా అమలు చేస్తాం

- ప్రజాపాలనతో వివరాల సేకరణ
- సమగ్ర విచారణ తర్వాతే పథకాలు అమలు చేస్తాం
- రైతుభరోసా, కౌలురైతులపై సీఎం నిర్ణయం తీసుకుంటారు
- బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమాలు కొనసాగిస్తాం
- ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజాపాలన సన్నాహక సమావేశంలో మంత్రి కొండా సురేఖ

5

- ప్రొటోకాల్ అమలు చేయాలన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- ఆర్టీసీ బస్సులు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు
- ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, సునీతారెడ్డి





మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో మంత్రి కొండా సురేఖ

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేస్తుందని అటవీ, దేవాదాయశాఖల మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి కొండా సురేఖ అన్నారు. కౌలు రైతులకూ రైతుభరోసా వర్తింపుపై సీఎం నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజాపాలన సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజాపాలనతో వివరాలు సేకరిస్తున్నామన్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా విచారించిన తర్వాత ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన మంచి కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొటోకాల్ పాటించడంలేదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతారెడ్డి, చింతా ప్రభాకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, బస్సుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

- సంగారెడ్డి, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ)





సంగారెడ్డిలో నిర్వహించిన సమావేశానికి వస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు